పిడుగుపాటుకు నలుగురి మృతి

న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబర్ 24: తెలంగాణ వ్యాప్తంగా మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. పలు చోట్ల పిడుగులు పడి నలుగురు మృత్యువాతపడగా.. పలువురు గాయపడ్డారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం కురువగా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీ వర్షం పడింది. ఖమ్మం నగరంలోని ప్రధాన వీధులన్నీ జలమయమయ్యాయి. వ్యవసాయ పనులు చేస్తున్న సమయంలో పిడుగుపడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం జగ్గారం శివారు బూరుగుగుంపునకు చెందిన కూలీలు కట్టం నాగశ్రీ (22), సున్నం అనూష (23) మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం బత్తులపల్లికి చెందిన లక్ష్మయ్య (65) పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లిలో సోమవారం రాత్రి పిడుగుపడి ఎర్రబొజ్జు రాధిక ఇల్లు ధ్వంసమైంది. ఇంట్లో వారు ఊరికి వెళ్లడంతో ప్రాణనష్టం జరగలేదు. సింగూరు ప్రాజెక్టు నుంచి వరద వస్తుండటంతో మెదక్ జిల్లా పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గా ప్రాజెక్టు పొంగిపొర్లుతున్నది. దీంతో ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయాన్ని అధికారులు మూసివేశారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేటలో పిడుగుపడి పశువుల కాపరి కృష్ణకుమార్ (30) మృతి చెందాడు. వారం రోజులుగా వానలు లేక బీటలు వారుతున్న వరికి ఈ వర్షం ఊరటనిచ్చింది. పత్తి పంట రైతులకు సైతం కలిసొచ్చింది.

బంగాళాఖాతంలో అల్పపీడనం

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో రాగల నాలుగురోజుల పాటు భారీ వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. వరంగల్, నాగర్‌కర్నూల్, నిర్మల్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నిజామాబాద్, జోగుళాంబ-గద్వాల, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఖిల్లా-వరంగల్ మండలంలో 9.67 సెం.మీ. అత్యధిక వర్షపాతం నమోదైంది.

ఎమ్మెల్యే గాంధీపై చర్యలు తథ్యం

- ఆయన అనుచరులపైనా కేసు
- రాష్ట్రంలో మావోయిస్టుల కదలికల్లేవ్
- ఉగ్రవాదుల జాడ కూడా లేదు.. ఉంటే చెప్తాం
- విలేకరుల సమావేశంలో డీజీపీ జితేందర్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై చర్యలు తీసుకుంటామని, ఆయన అనుచరులపైనా కేసులు నమోదు చేశామని డీజీపీ జితేందర్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, గాంధీ వివాదంపై స్పందిస్తూ ఇప్పటికే గాంధీ, ఆయన అనుచరులపై కేసులు నమోదు చేసినట్టు వివరించారు. ఛత్తీస్‌గఢ్‌లో కూంబింగ్ జరుగుతున్నందున తెలంగాణలోకి మావోయిస్టులు వస్తే.. తమ భద్రతా దళాల నుంచి ప్రతిఘటన ఎదుర్కోక తప్పదని, అవసరమైతే ఎన్‌కౌంటర్లకూ వెనుకాడబోమని స్పష్టంచేశారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర మినహా తెలంగాణలో మావోయిస్టుల కదలికలు లేవని చెప్పారు. హైదరాబాద్‌లో ఉగ్రవాదుల జాడ లేదని తెలిపారు. ఉగ్ర కదలికలపై నిఘా ఉంచామని, సమాచారం ఉంటే తెలియజేస్తామని చెప్పారు. వినాయక నిమజ్జనాల్లో డీజే సిస్టమ్స్ ఉపయోగించొద్దని, వాటివల్ల ఎన్నో అనర్థాలు ఉన్నాయని సూచించారు. చిన్న చిన్న ఘటనలు మినహా వినాయక చవితి, నిమజ్జనాలు, మిలాద్ ఉన్ నబీ కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిశాయని చెప్పారు. మొత్తం 5,879 ప్రాంతాల్లో 1,36,638 విగ్రహాలు నిమజ్జనం చేసినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 15,400 మంది పోలీసులు, 47 ప్లాటూన్స్‌తో విధులు నిర్వర్తించినట్టు చెప్పారు.

జైనూర్ ఘటన దురదృష్టకరం

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన జైనూర్ ఘటన దురదృష్టకరమని డీజీపీ అన్నారు. వెంటనే పరిస్థితిని అంచనా వేసి, 38 మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. 720 మంది పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో జైనూర్ మొత్తం మోహరించామని వివరించారు. లా అండ్ ఆర్డర్ ఏడీజీ, ఐజీతో భద్రతను పర్యవేక్షించామని తెలిపారు. సివిల్ కేసుల్లో తలదూర్చిన చిక్కడపల్లి ఏసీపీపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ నిందితులకు రెడ్ కార్నర్ నోటీసులు ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. దానికి చాలా ప్రాసెస్ ఉంటుందని సీబీఐ, ఇంటర్‌పోల్ సహకారంతో నోటీసులు ఇచ్చే అవకాశం ఉందని చెప్పారు. డప్పు కొట్టకపోతే గ్రామ బహిష్కరణ చేసిన ఘటన తమ దృష్టికి వచ్చిందని, ఆ వెలివేతకు సంబంధించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఏడీజీ మహేశ్ భగవత్, ఐజీలు సత్యనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, రమేశ్ ఉన్నారు.

ఇస్రో చైర్మన్‌కు పుస్తక బహూకరణ

రవీంద్రభారతిలో మంగళవారం తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ, రీజియన్ మళయాలీ అసోసియేషన్, హైదరాబాద్ ఫోరమ్ ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పేస్ టూస్ పేరిట నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో నమస్తే తెలంగాణ కార్టూనిస్ట్ మృత్యుంజయ తన కార్టూన్ల పుస్తకాన్ని ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్,పర్యాటక, సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావుకు అందజేశారు.

నేడు, రేపు ఓపెన్ పరీక్ష ఫీజు చెల్లించే చాన్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ): ఓపెన్ స్కూల్ సొసైటీ వార్షిక పరీక్షలకు హాజరయ్యేందుకు అధికారులు మరో అవకాశమిచ్చారు. బుధ, గురువారాల్లో తాత్కాల్ కింద ఫీజు చెల్లించేందుకు అవకాశమిచ్చినట్టు డైరెక్టర్ సీవీ శ్రీహరి ప్రకటనలో తెలిపారు. పదోతరగతి వారు రూ.500, ఇంటర్మీడియట్ వారు రూ.వెయ్యి ఆలస్య రుసుముతో ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. అక్టోబర్ 3 నుంచి 9వరకు వార్షిక పరీక్షలను నిర్వహించనుండగా, ఈనెల 30న హాల్‌టికెట్లు విడుదల చేస్తామని తెలిపారు.

భూవివాదంలో రాళ్లదాడి

- రైతులు, వెంచర్ నిర్వాహకుల మధ్య ఘర్షణ
- అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్‌లో ఉద్రిక్తత

గాయపడ్డ రైతు

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 24: ఓ భూమి విషయమై రైతులు, వెంచర్ నిర్వాహకుల మధ్య ఏర్పడిన గొడవ.. రాళ్లు, కర్రల దాడి వరకు వెళ్లింది. ఈ ఘటన మంగళవారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్‌లో చోటుచేసుకుంది. పిగ్లీపూర్‌లోని సర్వే నంబర్ 17లో గోపాల్‌యాదవ్ వెంచర్ ఏర్పాటు చేస్తున్నారు. పలువురు రైతులు వెంచర్‌లోకి వెళ్లి.. ఇందులో సర్కారు పట్టాలు ఇచ్చిన సీలింగ్ భూమి ఉన్నదంటూ ట్రాక్టర్‌తో పనులు చేసేందుకు యత్నించారు. దీన్ని వెంచర్ నిర్వాహకులు, సిబ్బంది అడ్డుకుంటుంటే.. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు రాళ్లతో దాడి చేసుకోగా పోలీసులు చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. గాయపడ్డ రైతుల్లో పంది ముత్తయ్య, నర్సింహ, ఆకుల సత్యనారాయణ, శంకర్, మరో ఇద్దరు ఉండగా.. వెంచర్ నిర్వాహకుల్లో లోకేశ్, దర్శన్ రెడ్డి, మరొకరు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. వనస్థలిపురం ఏసీపీ, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అంజిరెడ్డి సిబ్బందితో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. వెంచర్ నిర్వాహకులు సంప్రదింపుల కోసం పిలిచి దాడి చేశారని, కులం పేరుతో దూషించారని రైతులు ఫిర్యాదు చేశారు. వెంచర్‌లోకి చొరబడిన కొందరు స్థానికులు.. వెంచర్ నిర్వాహకులు, సిబ్బందిపై దాడికి దిగారని ఫిర్యాదు చేశారు. పరస్పరం ఫిర్యాదుల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా.. పిగ్లీపూర్‌లో తమకు ప్రభుత్వం సీలింగ్ భూములిచ్చి పట్టాలు అందజేసిందని, ఆ భూముల్లోకి జరిగి కొందరు వెంచర్ చేస్తున్నారని, దీనిపై రెవెన్యూ, హెచ్‌ఎండీఏ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతులు ఆరోపించారు. గతంలో పని చేసిన మండల రెవెన్యూ అధికారి ఇష్టానుసారంగా అనుమతులు ఇచ్చారని విమర్శించారు. వెంచర్ నిర్వాహకులు మాట్లాడుకుందామని పిలిచి, మహిళలు, పెద్ద మనుషులపై సిబ్బందితో దౌర్జన్యంగా రాళ్లు, కర్రలతో దాడిచేయించారని వాపోయారు. మరోవైపు, తమ వెంచర్‌లోని సర్వేనంబర్‌లో ఎలాంటి సీలింగ్ భూమి లేదని నిర్వాహకులు చెప్తున్నారు.

ప్రాథమిక బడుల్లో ప్రీ ప్రైమరీ

- బాలవాటిక పేరుతో తరగతులు
- అధికారులను ఆదేశించిన సీఎం
- ప్రత్యేకంగా పాలసీ రూపకల్పన
- అంగన్‌వాడీల పరిస్థితి ఏంటి?

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం సర్కారు బడుల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ వంటి పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభించాలనుకుంటున్నది. బాలవాటిక పేరుతో తరగతులను నిర్వహించడానికి విద్యాశాఖ అధికారులు కసరత్తు తీవ్రతరం చేశారు. రాష్ట్రంలో 18,241 ప్రాథమిక బడులున్నాయి. 3,144 ప్రాథమికోన్నత బడులను పీఎస్‌లలో విలీనం చేయనున్నారు.

ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రభావం..

ప్రస్తుతం పూర్వప్రాథమిక విద్యాబోధన అంగన్‌వాడీ కేంద్రాల్లో కొనసాగుతున్నది. సర్కారు బడుల్లో ఒకటో తరగతి నుంచి ప్రవేశాలు కల్పిస్తున్నారు. ప్రైవేట్ బడుల్లో నర్సరీ నుంచే విద్యార్థులను చేర్చుకుంటుండంతో వారు అక్కడే కొనసాగుతున్నారు. ప్రభుత్వ బడుల్లోనూ పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభించడం ద్వారా నర్సరీ దశలోనే విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్ల బాట పట్టే వీలుంటుందన్న ఆలోచనలో కసరత్తు చేస్తున్నది.

అంగన్‌వాడీలుంటాయా..?

రాష్ట్రంలో 149 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో 6.67లక్షల మంది మూడేండ్ల నుంచి ఆరేండ్ల మధ్య వయస్కులు నమోదయ్యారు. కేంద్రం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ) పూర్వ ప్రాథమిక విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయాలని స్పష్టం చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదిశగా ముందుకెళ్తున్నది. దీంతో అంగన్‌వాడీలు ఉంటాయా..? అన్న చర్చ నడుస్తున్నది. ప్రీ ప్రైమరీ బోధనకు కొత్త టీచర్లను నియమించాలని యోచిస్తుండటంతో అంగన్‌వాడీ టీచర్ల పరిస్థితేమిటన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



డీజీపీ ఆఫీస్ ఎదుట న్యాయం చేయాలని వేడుకుంటున్న బాధిత కుటుంబం

న్యాయమా.. నువ్వెక్కడ!

- తమ బిడ్డ హత్యపై నిగ్గు తేల్చాలని బాధితుల డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): 'అయ్యా నా బిడ్డది రోడ్డు ప్రమాదం కాదు. ముమ్మాటికీ హత్యే. సాక్ష్యాల్లేవని, రోడ్డు ప్రమాదంగా తేల్చి పోలీసులు కేసు మూసేశారు. మరోసారి విచారణ చేపట్టి న్యాయం చేయండి' అంటూ కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన బాధిత కుటుంబం జోరువానలో డీజీపీ కార్యాలయం ముందు ఆర్తనాదాలు చేసింది. చొప్పదండి మున్సిపాలిటీకి చెందిన మందా విను జనవరి 22న అనుమానాస్పదంగా చనిపోయాడు. పాతకక్షల నేపథ్యంలో స్నేహితులే మేడారం జాతరకు తీసుకెళ్లి చంపేశారని తల్లి చెప్తున్నది. స్థానిక పోలీసులు డబ్బు తీసుకొని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి కేసు కొట్టివేశారని ఆరోపిస్తున్నారు. ఇదే విషయంపై జూలైలో డీజీపీ ఆఫీసులో మొర పెట్టుకోగా.. డబ్బు తీసుకున్న డీఎస్పీ, ఎస్సైకే మళ్లీ విచారణ బాధ్యతలు అప్పగించారని, దీంతో తమకు న్యాయం జరగలేదని ఆవేదనను వెళ్లగక్కారు. నిందితుల్లో కొందరికి కాంగ్రెస్ నాయకుల అండదండలు ఉండటం వల్లే తమకు అన్యాయం చేస్తున్నారని బోరున విలపిస్తూ చెప్పారు. ఈ కేసును రీఓపెన్ చేయించి, ఇంటెలిజెన్స్ పోలీసులతో విచారణ చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి తమ గోడు విన్నవించుకున్నారు.

రెండ్రోజుల్లో రైతులకు పరిహారం

- అన్ని జిల్లాల నుంచి నివేదికలు రాకపోవడం వల్లే ఆలస్యం
- కేంద్రం నుంచి ఎలాంటి వరద సహాయం అందలేదు..
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అకాల వర్షాలు, వరదలతో పంట నష్టపోయిన రైతులకు మరో రెండు రోజుల్లో పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయిలతో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో తీవ్రంగా పంట నష్టపోయిన జిల్లాల నుంచి నివేదికలు అందాల్సి ఉందని, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్, నాగర్ కర్నూల్, వికారాబాద్, వనపర్తి, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల నుంచి నివేదికలు ప్రభుత్వానికి ఇంకా అందలేదన్నారు. అవి రాగానే వాటి ఆధారంగా ఆయా జిల్లాలకు తక్షణమే నష్టపరిహారం అందేలా చూడాలని ముఖ్యమంత్రిని కోరామని తెలిపారు. కేంద్రం నుంచి ఇప్పటివరకు ఎటువంటి వరద సాయం అందలేదని, తాము నివేదికలు అందించామని తెలిపారు. రూ.2 లక్షలకుపైగా రుణమాఫీపై క్యాబినెట్‌లో నిర్ణయిస్తామని గతంలో చెప్పారని పాత్రికేయులు ప్రశ్నించగా.. మంత్రి మీరే రాసుకున్నారు, మీరే అడుగుతున్నారని సమాధానం ఇచ్చారు.

నగరం నలువైపులా జాతీయ రహదారులే..

మామిళ్లగూడెం, సెప్టెంబర్ 24 : ఖమ్మం నగరం అత్యంత ఆధునాతన నివాస నగరంగా మారనుందని, నగరానికి నలుమూలలా రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా రింగ్ రోడ్డు రానుందని, సెంటీమీటర్ జాతీయ రహదారిలేని ఖమ్మం జిల్లాకు వేల కిలోమీటర్ల జాతీయ రహదారులను రూ.వేల కోట్లతో తీసుకొచ్చామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పొన్నెకల్ వద్ద ప్రారంభంకానున్న దేవరపల్లి రోడ్డు దగ్గర నుంచి కలెక్టరేట్ వరకు సర్వీస్ రోడ్డు నిర్మాణం చేసేందుకు పరిశీలన చేస్తున్నామని, దీనిపై ఎన్‌హెచ్ అధికారులతో చర్చించామని దీని ప్రకారంగా మంజూరు చేయిస్తామని తెలిపారు. ఖమ్మం- కోదాడ జాతీయ రహదారి ప్రజలకు అందుబాటులోకి వచ్చిందన్నారు. నగరంలోని ప్రకాష్ నగర్ వంతెన మరమ్మతు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని, దీనికి సంబంధించి నిపుణుల కమిటీ సందర్శించి పరిశీలించిందన్నారు.

గీత కార్మికులకు రక్షక కవచ కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి తుమ్మల

వంతెనపై ఉన్న 24 బేరింగ్‌ల్లో 9 బేరింగ్‌లు ఇటీవల వరదల కారణంగా దెబ్బతిన్నాయని, వీటి మరమ్మతుల కోసం 3నెలల సమయం పడుతుందన్నారు. నగర వాహనదారులకు రాకపోకలకు ఇబ్బంది లేకుండా వంతెన నిర్మాణానికి ముందు ఉన్న పాత చప్టాను పునరుద్ధరిస్తామని, దీనికోసం రూ.30 లక్షలు తక్షణమే విడుదల చేశామన్నారు. రిమోట్ సెన్స్ మ్యాపుల ఆధారంగా ఖమ్మం నగరంలో అక్రమ కట్టడాలపై చర్యలు ఉంటాయన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని మున్నేరు రిటైనింగ్‌వాల్‌ను రీడిజైన్ చేస్తామని తెలిపారు.

మోడల్ మార్కెట్‌గా ఖమ్మం ఏఎంసీ.. మంత్రి తుమ్మల

ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబర్ 24 : గిట్టుబాటు ధర విషయంలో అధికారులు అప్రత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. మంగళవారం నగర వ్యవసాయ మార్కెట్‌లో మంత్రి ఆకస్మిక పర్యటన చేశారు. తొలుత మిర్చియార్డులో పర్యటించి రైతులు తీసుకొచ్చిన పంటను పరిశీలించారు. అక్కడే ఉన్న కార్మికులు, వ్యాపారులతో మాట్లాడారు. పత్తియార్డులో ఏర్పాటుచేసిన మార్క్‌ఫెడ్ పెసల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. మంత్రి మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర అందించే బాధ్యత అధికారులు తీసుకోవాలన్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ మరికొద్దిరోజుల్లోనే మోడల్ మార్కెట్‌గా అవతరించబోతుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పీ దుర్గాప్రసాద్, నాయకులు సాదు రమేష్‌రెడ్డి, కమర్తపు మురళి, తుపాకుల యలగొండ స్వామి, తల్లాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికులందరికీ రక్షక కిట్లు.. మంత్రి తుమ్మల

ఖమ్మం, సెప్టెంబర్ 24 : గీత కార్మికులందరికీ కాటమయ్య రక్షక కవచ కిట్లను అందజేస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీశాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్ పంపింగ్‌వెల్ రోడ్డులో టీయూఎఫ్‌ఐడీసీ నిధులు రూ.2 కోట్లతో చేపట్టిన స్ట్రాం వాటర్ డ్రెయిన్, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం తెలంగాణ కల్లుగీత కార్మికుల సహకార ఆర్థిక సంఘం, హైదరాబాద్‌శాఖ సహకారంతో 100 మంది కల్లు గీత కార్మికులకు కాటమయ్య రక్షక కవచం భద్రత కిట్లను మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో దుర్గప్రసాద్, రమేష్‌రెడ్డి, మేయర్ నీరజ, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ హేమలత, కార్పొరేటర్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన నాయకులు

ఖమ్మం, సెప్టెంబర్ 24 : ఖమ్మం జిల్లా పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ నాయకులు మంగళవారం ఖమ్మంలో మంత్రి తుమ్మల నాగేశ్వరావుని మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఈశ్వరప్రగడ రంగనాథ్, కూరపాటి మంజుల, శ్రీనివాస రవికుమార్, గోపాలరావు, పిచ్చయ్య, నగేష్, విప్లవ్‌కుమార్, రామ్మూర్తి, నాగబత్తిని రవి, జనార్దనరావు తదితరులు ఉన్నారు.

వసతులు కల్పించాలని వినతి

ఖమ్మం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సంస్కృతిక సంస్థ సభ్యులు మంత్రి తుమ్మల నాగేశ్వరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాగబత్తిని రవి పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

దగ్గరుండి పనులు పర్యవేక్షించిన కమిషనర్

నూతనంగా నిర్మిస్తున్న ఇల్లు

వైరాటౌన్,సెప్టెంబర్ 24: వైరాలో ప్రభుత్వ స్థలాలను మున్సిపల్ సిబ్బంది ఆక్రమించుకొని ఇళ్లు నిర్మిస్తుండగా కమిషనర్ సీహెచ్ వేణు దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు. వైరాలోని ఎన్నెస్పీ స్థలాల్లో స్థానిక బాలాజీనగర్ లోగల ఖాళీ స్థలాలలను ఆక్రమించుకుని పలువురు ఇళ్లను నిర్మించారు. ఇటీవల నూతనంగా నిర్మించిన పల్లె దవాఖాన సమీపంలో వైరా మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి, సిబ్బంది పాలకవర్గ సభ్యుల సహకారంతో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి ఇళ్లు నిర్మిస్తున్నారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలోని పల్లిపాడు, దుద్దిపూడి, వైరా పట్టణ ప్రాంతంలో ఉన్న కాల్వ వెంట ఖాళీ స్థలాలలను ఆక్రమించుకొని కట్టడాలు జరపుతున్నారు. గతంలో నిర్మించిన ఇళ్లను కూల్చివేయాలని అధికారులకు ఆదేశాలిచ్చినప్పటికీ ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతార్ చేస్తూ ఖాళీగా ఉన్న స్థలాలలో సైతం ప్రభుత్వ ఉద్యోగులే నిర్మాణాలు చేపట్టడం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా ఇల్లు లేని పేద ప్రజలు ఇండ్లు నిర్మించుకోవచ్చని రాజకీయ నాయకులే దగ్గరుండి పనులు చేపిస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.

కూల్చివేస్తామని ఆదేశాలిచ్చినా వినలేదు.. - మున్సిపల్ కమిషనర్ వేణు

ఎన్నెస్పీ స్థలంలో నూతనంగా నిర్మాణఖూలు చేపడుతున్న కట్టడాలను కూల్చివేస్తామని చెప్పినా వినలేదు. మున్సిపాలిటి పరిధిలోని బాలాజీ నగర్ సమీపంలో ఎన్నెస్పీ కాలువ స్థలంలో అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్న విషయం తెలుసుకొని అక్కడికి వెళ్లి పనులు నిలిపివేయాలని ఆదేశిలిచ్చాను. అయినప్పటికీ ఆక్రమదారులు నిర్మాణం చేపట్టారు. సమీపంలోని ప్రజలు ఖాళీ స్థలాల్లో గుడిసెలు వేసేందుకు ప్రయత్నించగా వాటిని తొలగించాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లా.

నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకుంటాం..

పాలేరులో విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి

కూసుమంచి, సెప్టెంబర్ 24: 'రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలతో 1.50 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. దీనికితోడు ఖమ్మం జిల్లాలో సాగర్ నీరు రాకపోవడంతో పంట నష్టపోయిన రైతుల వివరాలపై వ్యవసాయ నివేదిక తయారు చేస్తోంది. ఆ రైతులను కూడా ఆదుకుంటాం. కాల్వల మరమ్మతు కారణంగా అనుకున్న దాటికంటే సాగర్ కాల్వలకు నీటి విడుదల నాలుగు రోజులు ఆలస్యమైంది. ఈసారి ఆయకట్టు రైతులకు రెండు పంటలకు కచ్చితంగా నీరిస్తాం' అని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా పాలేరులో సాగర్ కాల్వను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. సాగర్ కాల్వ మరమ్మతు పనులు పూర్తి చేసి జిల్లా ఆయకట్టుకు నీటి అందిస్తున్నామని తెలిపారు. బుధవారం రాత్రి వరకు జిల్లా చివరి ఆయకట్టుకు నీటిని అందించే విధంగా ఇరిగేషన్ అధికారులను ఆదేశించామన్నారు.

రెండు రోజుల్లో పరిహారం..

విపత్తుల వల్ల జిల్లాలో 24 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, ఇప్పటికే వారికి డబ్బులు ఇచ్చేందుకు అంతా సిద్ధం చేశామని మంత్రి తెలిపారు. రెండు రోజుల్లో ఎకరాకు రూ.10 వేల చొప్పున అందిస్తామన్నారు. అలాగే సాగర్ కాల్వ నీరు అందక దెబ్బతిన్న పొలాలు ఎన్ని ఎకరాలు? ఎక్కడెక్కడ దెబ్బతిన్నాయనే దానిపై వ్యవసాయ శాఖ నివేదిక తయారు చేస్తుందని, ఆ రైతులను కూడా ఆదుకుంటామన్నారు. పాలేరు కాల్వకు గండిపడిన తర్వాత మళ్లీ లీక్ కావడంతో నీటి విడుదల ఆలస్యమైందని, దీనిని రైతులు అర్థం చేసుకోవాలన్నారు. ఇసుక మేట వేసిన రైతులను ప్రత్యేక ప్యాకేజీతో ఆదుకుంటామని తెలిపారు. సమావేశంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీఈ విద్యాసాగర్, ఈఈ అనన్య, డీఈ మధు, గుత్తేదారు ముత్తయ్య నాయుడు, ఇరిగేషన్ అధికారులు, డీఏఓ పుల్లయ్య, ఏడీఏ సరిత, అధికారులు కోక్యా నాయక్, వాణి, సురేశ్‌కుమార్, వేణుగోపాల్‌రెడ్డి, ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ సంజీవ్ నాయకులు పాల్గొన్నారు.

'నిరంతర శ్రమతోనే లక్ష్యాల సాధన సాధ్యం'

జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కే.వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మధిర, సెప్టెంబర్ 24: నిరంతర శ్రమతోనే లక్ష్యాల సాధనను సాధ్యం చేసుకోవచ్చునని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కే.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. అలాగే, విషయ పరిజ్ఞానంపై పట్టు పెంచుకోవడం వల్ల కూడా విద్యార్థులు విజయాలను సాధించగలుగుతారని అన్నారు. మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించిన ఆయన.. హెచ్‌ఎం తోట నరసింహారావు అధ్యక్షతన విద్యార్థులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సూచనలను విద్యార్థులు తప్పక పాటించాలని సూచించారు. తన క్లాస్‌మేట్ అయిన ఈ పాఠశాల ఉపాధ్యాయుడు జ్ఞానేశ్వరచారిని కలుసుకున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం జేఎన్‌టీయూ రిజిస్ట్రార్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే సెర్ఫ్ లక్ష్యం

మాట్లాడుతున్న ఏపీడీ నూరుద్దీన్

కారేపల్లి, సెప్టెంబర్ 24: మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందడమే సెర్ఫ్ లక్ష్యమని డీఆర్‌డీవో అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ మహమ్మద్ నూరుద్దీన్ అన్నారు. మంగళవారం స్థానిక ఇందిరాక్రాంతి పథం కార్యాలయంలో సెర్ఫ్ ఉద్యోగులు, వీవోఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇందిరా మహిళా శక్తి అనే పథకం ద్వారా ప్రతి సభ్యురాలకు వడ్డీ లేని రుణాలు అందజేస్తుందన్నారు. ఇందులో రుణం తీసుకున్న సభ్యులకు అప్పుపై రూ.2 లక్షలు, ప్రమాద బీమాగా రూ.10 లక్షలను అందజేస్తారన్నారు. అదేవిధంగా అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా గ్రామసమాఖ్య అధ్యక్షులను పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షులుగా నియమించి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఐదుగురు వీవోఏలను తొలగించామని, వారి స్థానంలో మిగతా వారికి అదనపు బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు. ఆయన వెంట ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు ఉన్నారు.

జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటిది

పెనుబల్లి, సెప్టెంబర్ 24: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న జమిలి ఎన్నికలు అనే నినాదం దేశ ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు వంటిదని, ఈ ఆలోచన విధానాన్ని తక్షణమే విరమించుకోవాలని సీపీఎం ఖమ్మం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు అన్నారు. మంగళవారం స్థానిక చలమాల సూర్యనారాయణ భవనంలో మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగ స్ఫూర్తి, సమైక్య రాష్ట్రాల స్ఫూర్తికి జమిలి ఎన్నికల్లో పూర్తి వ్యతిరేకమని, నియంతృత్వ పాలనకు బీజాలు వేయడానికి జమిలి ఎన్నికల విధానాన్ని బీజేపీ తీసుకొస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గాయం తిరుపతిరావు, నల్లమల అరుణప్రతాప్, చలమాల నర్సింహారావు, మిట్టపల్లి నాగమణి పాల్గొన్నారు.

పెండింగ్ డీఏ విడుదల చేయాలి

రఘునాథపాలెం, సెప్టెంబర్ 24: పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యల సేకరణ, జనరల్ ఫండ్, సభ్యత నమోదు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని రఘునాథపాలెం కేజీబీవీని సందర్శించారు. కేశవరావు, మోహన్‌దాస్, నాగమల్లేశ్వరరావు, కేజీబీవీ ఎస్‌వో లత పాల్గొన్నారు.

సెకండ్‌హ్యాండ్ వాహన కొనుగోలుదారులు పత్రాలు సరిచూసుకోవాలి

పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

మామిళ్లగూడెం, సెప్టెంబర్ 24: సెకండ్‌హ్యాండ్ వాహనాలను కొనుగోలు చేసే ముందు వాహన పత్రాలను కచ్చితంగా వెరిఫికేషన్ చేసుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీల్లో సెకండ్‌హ్యాండ్ ఫైనాన్స్ ద్వారా తీసుకున్న ద్విచక్రవాహనాలకు సరైన పత్రాలు, నెంబర్ ప్లేట్లు, రిజిస్ట్రేషన్ లేకుండా పట్టుబడుతున్నాయని తెలిపారు. ఇటీవల కాలంలో చైన్‌స్నాచింగ్, దొంగతనాలు చేసే నిందితులు పోలీసులు, సీసీ కెమెరాల నుంచి తప్పించుకునేందుకు నెంబర్లప్లేట్లను తొలగిస్తున్నారని పేర్కొన్నారు. సరైన పత్రాలు లేని వాహనాలపై కేసులు నమోదు చేస్తామని, వాహనదారులు ఇన్సూరెన్స్, ఆర్‌సీ బుక్, పొల్యూషన్ వంటి పత్రాలు దగ్గర ఉంచుకోవాలని స్పష్టం చేశారు.